క్లుప్తంగా

ఏఎస్ఐ అర్జున్‌కు ఘన సన్మానం



ఏఎస్ఐ అర్జున్ దంపతులను సన్మానిస్తున్న సీఐ శ్రీనివాసరావు, పోలీస్ సిబ్బంది

జి.మాడుగుల: జిల్లాలో పలు పోలీస్ స్టేషన్లలో వివిధ పదవుల్లో విధులు నిర్వర్తిస్తూ ఏఎస్ఐగా ఉద్యోగ విరమణ చేస్తున్న బి.అర్జున్ శాంతిభద్రతల పరిరక్షణలో అందించిన సేవలు అమోఘమని సీఐ శ్రీనివాసరావు కొనియాడారు. ఈ మేరకు సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో అర్జున్ దంపతులకు పూలమాల వేసి, శాలువా కప్పి సీఐ, పోలీస్ సిబ్బంది ఘనంగా సన్మానించారు. అర్జున్‌తో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వీరంపాలెం రోడ్డు నిర్మాణానికి భూమి పూజ



బీటీ రోడ్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

అడ్డతీగల: మండలంలోని డి.రామవరం నుంచి వీరంపాలెం గ్రామానికి 3.2 కిలోమీటర్ల మేరకు బీటీ రోడ్ నిర్మాణానికి రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి సోమవారం భూమిపూజ చేశారు. నియోజకవర్గంలో మరిన్ని చోట్ల చేపట్టవలసిన పనుల కోసం ప్రతిపాదనలు పంపించామని, అనుమతులు రాగానే పనులు చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు మఠం విజయభాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నూకాంబిక విగ్రహ ప్రతిష్ట



ఆనందపురంలో నూకాంబికను దర్శించుకున్న ఎంపీపీ జగన్‌మోహన్

కె.కోటపాడు : ఆనందపురం గ్రామంలో నూకాంబికా అమ్మవారి ఆలయ ప్రారంభోత్సవ, విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం సోమవారం ఘనంగా జరిపారు. అర్చకులు శ్రీనివాసశర్మ మండప పూజ, రుద్రాభిషేకం, ధాన్యాదివాసం, బింబదర్శనం, పసిడి కలశ ఏర్పాటు కార్యక్రమాలను జరిపిన అనంతరం భక్తులకు అమ్మవారి దర్శన భాగ్యాన్ని కల్పించారు. కార్యక్రమానికి ఆనందపురం గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అమ్మవారిని కె.కోటపాడు ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, శ్రీకాంత్ శ్రీను, సర్పంచ్ వంటాకు అప్పాజి దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్న సమారాధన జరిపారు.

నేటితో ముగియనున్న పదో తరగతి పరీక్షలు

మాడుగుల రూరల్ : పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు మంగళవారంతో ముగుస్తున్నాయి. ఈ నెల 17 వ తేది నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. సోమవారం సోషల్ పరీక్ష జరగాల్సి ఉండగా, రంజాన్ పండగ పురస్కరించుకుని పరీక్షను మంగళవారం నాటికి వాయిదా వేశారు. మంగళవారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరుగుతుందని ఎంఈవో దేముడమ్మ తెలిపారు. మండలంలో ఐదు పరీక్ష కేంద్రాల ద్వారా 710 మంది రెగ్యులర్ విద్యార్థులు, 73 మంది ప్రైవేటు విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని ఆమె సోమవారం తెలిపారు.

శ్రీరామ నవమికి క్రీడా పోటీలు

మాడుగుల రూరల్ : గ్రామాలల్లో శ్రీరామ నవమి ఉత్సవాలు పురస్కరించుకుని ఆదివారం రాత్రి పలు క్రీడా పోటీలు నిర్వహించారు. కె.జె.పురం సీతారామచంద్రమూర్తులు ఆలయంలో నవమి ఉత్సవాల్లో భాగంగా, ఆదివారం రాత్రి చిడతల పోటీలు నిర్వహించారు. నవమి రోజు ఏప్రిల్ 6వ తేదీ వరకూ పోటీలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. ప్రతి రోజు రాత్రి 7 గంటల నుంచి 10 గంటల వరకు భజన కార్యక్రమం, కార్యక్రమంలో పాల్గొనే భక్తులకు చద్ది కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నారు.

నేత్రపర్వంగా భావనారుషి, భద్రావతి కల్యాణం

మునగపాక: తోటాడలో పురాతన శైవక్షేత్రం కాశీ విశ్వేశ్వరుని ఆలయంలో భద్రావతి సమేత భావనారుషిల కల్యాణం ఆదివారం రాత్రి వేడుకగా నిర్వహించారు. వేద పండితులు రాంప్రసాద్ శర్మ పర్యవేక్షణలో కల్యాణ తంతు జరిగింది. ముందుగా ఉత్సవమూర్తులను గ్రామంలో ఊరేగించి అనంతరం ప్రత్యేక మండపంలో కల్యాణం జరిపించారు.

గిరిజనుల వేదన పట్టదా?



గొల్లపల్లి, నడింవీధి గ్రామాల మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు(ఫైల్)

- గొల్లపల్లి–నడింవీధి మధ్య ప్రమాదకరంగా వాగు
- వారధి లేక రాకపోకలకు అవస్థలు

గూడెం కొత్తవీధి: ఏజెన్సీలోని గిరిజనులు పట్టించుకునే నాథుడే కరువయ్యారు. రహదారి సౌకర్యం లేక డోలీ మోతలు తరచూ దర్శనమిస్తూనే ఉన్నాయి. తాగునీటి సదుపాయం కూడా అంతంత మాత్రమే. వర్షా కాలంలో పలు గ్రామాల మధ్య రాకపోకలు దాదాపు స్తంభించిపోతున్నాయి. ఏజెన్సీలోకి గెడ్డలు, వాగులు పొంగి పొర్లుతూ ప్రవహించడమే ఇందుకు కారణం. గూడెం కొత్తవీధి మండలం అమ్మవారి దారకొండ పంచాయతీలో పలు గ్రామాల గిరిజనులు వారధి లేక రాకపోకలకు నానా అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా వర్షా కాలంలో ఈ మార్గంలో వాగులు పొంగడంతో రాకపోకలు పూర్తిగా స్తంభించిపోతున్నాయి. గిరిజనులు నిత్యం నరకం చూస్తున్నా అధికారుల్లో చలనం రావడం లేదు.

గొల్లపల్లి, నడింవీధి మధ్య పెద్ద వాగు ఉంది. ఇక్కడ వాగుపై వంతెన నిర్మించాల్సి ఉన్నా ఏళ్ల తరబడి అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడడం లేదు. ఈ మార్గంలో పది గిరిజన గ్రామాలున్నాయి. వారంతా ఏ నిత్యావసరాలు కావాలన్నా ఈ వాగును దాటి రావాల్సిందే. సాధారణ రోజుల్లో వాగు దాటగలుగుతున్నా చిన్నపాటి వర్షం కురిసినా కొండవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. వాగు ప్రవాహం ప్రమాదకరంగా ఉండడంతో గిరిజనులు భయాందోళనలు చెందుతున్నారు. వాగుపై చిన్నపాటి వంతెనను నిర్మించాల్సిన వేడుకుంటున్న అధికారులు పట్టించుకోవడం లేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వారధి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

అధికారులను కలిసినా ప్రయోజనం లేదు..



వంతెన నిర్మాణ కోసం గతంలో అధికారులు వచ్చి ఇక్కడ నేల స్వభావానికి సంబంధించి పరీక్షల కోసం నమూనాలు సేకరించి వెళ్లారు. ఆ తరువాత మళ్లీ ఎవరూ పట్టించుకోలేదు. ఎన్నిమార్లు అధికారులను కలిసినా ప్రయోజనం ఉండడం లేదు. వంతెన నిర్మిస్తే తమ పంచాయతీలోని సుమారు పది గ్రామాల గిరిజనుల రాకపోకలకు ఇబ్బందులు తప్పుతాయి.

– ముర్ల సత్యవతి, సర్పంచ్ ఎ.దారకొండ

మోదమ్మ ఉత్సవాలకు విరాళాల సేకరణ



పాడేరులోని బంగారం వర్తకుల నుంచి విరాళాలు సేకరిస్తున్న ఉత్సవ కమిటీ ప్రతినిధులు

సాక్షి, పాడేరు: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం పాడేరులోని మోదకొండమ్మతల్లి ఉత్సవాల కోసం విరాళాల సేకరణ చురుగ్గా సాగుతోంది. ఈ ఏడాది మోదమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించేలా పాడేరు ఎమ్మెల్యే, ఆలయ కమిటీ చైర్మన్ మత్స్యరాస విశ్వేశ్వర రాజు ఉత్సవ కమిటీకి రథసారధిగా వ్యవహరిస్తున్నారు. ఆయన నేతృత్వంలో ఉత్సవ కమిటీలో అన్ని వర్గాల భక్తులకు సముచిత స్థానం కల్పించారు. ఈ మేరకు ఉత్సవాలకు అవసరమైన ఆర్థిక వనరుల సేకరణకు ఉత్సవ కమిటీ ప్రతినిధులు శ్రమిస్తున్నారు. సోమవారం పాడేరు పట్టణంలోని మెయిన్ రోడ్డు, బంగారం మార్కెట్ ప్రాంతాలలో వ్యాపారులను కలిసి విరాళాలు సేకరించారు.

శ్రీరామ నవమికి ఏర్పాట్లు ప్రారంభం



పెళ్లి రాట వేస్తున్న కమిటీ సభ్యులు, భక్తులు

ముంచంగిపుట్టు: మండల కేంద్రం ముంచంగిపుట్టులో సోమవారం శ్రీరామ నవమి ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. స్థానిక సీతారాముల ఆలయ ప్రాంగణంలో పెళ్లి రాటను ఆలయ, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు భక్తిశ్రద్ధలతో వేశారు. దీపారాధన చేసి ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా స్వామివారి కల్యాణానికి తలంబ్రాలను సిద్ధం చేసి ఏర్పాట్లు మొదలు పెట్టారు. ఏటా మాదిరిగా ఈ ఏడాది కూడా శ్రీరామ నవమిని ఘనంగా నిర్వహించి, భారీ అన్నసంతర్పణ, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు.

పశువుల షెడ్‌లు త్వరితగతిన నిర్మించాలి



అనిగేరులో పశువుల షెడ్ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న అధికారులు

అడ్డతీగల: గ్రామాల్లో నిర్మిస్తున్న పశువుల షెడ్లను త్వరితగతిన పూర్తి చేయాలని ఉపాధి హామీ పథకం అడ్డతీగల క్లస్టర్ ఏపీడీ ఎల్.రాంబాబు చెప్పారు. అడ్డతీగల మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్మిస్తున్న పశువుల షెడ్లను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనిగేరులో పశువుల షెడ్, నీటి తొట్టే నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. మండల వ్యాప్తంగా 29 పశువుల షెడ్‌లు నిర్మాణ పనులు చేపట్టగా.. అవి వివిధ దశల్లో ఉన్నట్లు ఉపాధి హామీ ఏపీవో అరవాలు తెలిపారు. పశువుల దాహార్తి తీర్చడానికి ఏడు చోట్ల నీటి తొట్టెలు నిర్మిస్తున్నామన్నారు. మిగతా గ్రామాల్లో ఆయా నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించామన్నారు.

ట్రంప్ విధానాలను నిరసిస్తూ దిష్టిబొమ్మ దహనం



రంపచోడవరంలో ట్రంప్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న సంఘం ప్రతినిధులు

రంపచోడవరం: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న విధానాలను నిరసిస్తూ రంపచోడవరంలో అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ట్రంప్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు మాట్లాడుతూ ట్రంప్ ఇటీవల కొన్ని దేశాలకు సరకుల ఎగుమతులపై టారిఫ్‌ల భారం పెంచారన్నారు. ప్రపంచ దేశాల్లో అగ్రరాజ్యం ఆర్థిక ఆధిపత్యాన్ని పెంచుకోవడానికి చూస్తోందని విమర్శించారు. భారత్ ప్రజలకు నష్టకరమైన భారత్, అమెరికా వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేయాలని రంపచోడవరంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు కె.దూలయ్య, పల్లాల లచ్చిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణ అవసరం



చింతూరులో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు



పెదబయలులో నిరసన తెలుపుతున్న పాస్టర్లు



రంపచోడవరంలో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు



చింతపల్లిలో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న క్రిస్టియన్లు

చింతూరు: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై ప్రభుత్వం సమగ్రంగా విచారణ జరిపి నిజాలు నిగ్గు తేల్చాల్సిన అవసరం ఉందని చింతూరు డివిజన్ క్రైస్తవ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సంఘం ఆధ్వర్యంలో సోమవారం చింతూరు, కూనవరం, వీఆపురం, ఎటపాక మండలాలకు చెందిన పాస్టర్లు చింతూరులో శాంతి ర్యాలీ నిర్వహించారు. మండలంలోని రత్నాపురం నుంచి చింతూరు మెయిన్ రోడ్ వరకు ర్యాలీ నిర్వహించిన అనంతరం మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ క్రైస్తవ జీవనంపై అనేక బోధనలు చేసి క్రైస్తవులను ఉత్తేజపరిచారని, ఆయన మృతి హత్యా? ప్రమాదమా? అనే విషయాన్ని తేల్చాలని వారు కోరారు. దేశంలో, రాష్ట్రంలో మైనార్టీలపై జరుగుతున్న దాడులను నివారించేలా ప్రభుత్వాలు కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

రంపచోడవరంలో..

రంపచోడవరం: పాస్టర్ ప్రవీణ్ మృతికి నిరసనగా రంపచోడవరంలో పాస్టర్‌లు శాంతి ర్యాలీ నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి ప్రవీణ్ పగడాల చిత్రపటానిని పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జోష్‌పాల్, సంతోష్‌కుమార్, చంద్రపాల్, ఎర్నెస్ట్ బాబు, ప్రభుదాస్, మోజెస్, తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లిలో..

చింతపల్లి: ఫాదర్ ప్రవీణ్ మృతి పట్ల న్యాయ విచారణ జరిపించాలని క్రిస్టియన్ ఫెలోషిప్, షారోన్ టీం పాస్టర్ల సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. సోమవారం చింతపల్లి హనుమాన్ జంక్షన్ నుంచి బస్టాండ్, మండల కార్యాలయాలు, డిగ్రీ కళాశాల మీదుగా గ్రామ వీధుల్లో సంఘం ఆధ్వర్యంలో భారీ శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు మండలాల పాస్టర్లు మాట్లాడుతూ క్రైస్తవులపై గత 10 సంవత్సరాలుగా లేనటువంటి దాడులు.. ప్రస్తుతం ఎక్కువగా జరుగుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇటీవల జరుగుతున్న దాడులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు చర్చిలు, పాస్టర్లకు రక్షణ కల్పించాలని, క్రైస్తవులపై జరుగుతున్న దాడులకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఫెలోషిప్ అధ్యక్షుడు డేవిడ్‌రాజ్, పాస్టర్లు కాలేబు, భూషణం, జోసఫ్, బాబూరావు, డేవిడ్, తిమోతి, షారోన్ టీం సభ్యులు హేమంత్ కుమార్, ముర్ల వెంకటరమణ, అర్జున్, వనరాజు, గాంధీతో పాటు చింతపల్లి, జీకే వీధి, కొయ్యూరు, జిమాడుగుల, పాడేరు, పెదబయలు మండలాలకు చెందిన క్రైస్తవులు పాల్గొన్నారు.

పెదబయలులో కొవ్వొత్తులతో నిరసన

పెదబయలు: ఫాదర్ ప్రవీణ్ మృతికి కారణమైన నిందితులను కఠినంగా శిక్షించాలని పెదబయలు మండల పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు నిక్కుల వైకుంఠం డిమాండ్ చేశారు. సోమవారం పెదబయలు చర్చి ఆవరణలో కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాస్టర్లు మాట్లాడుతూ మృతి పట్ల ప్రభుత్వం త్వరగా దర్యాప్తు చేసి క్రైస్తవులకు న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పెదబయలు ఫెలోషిప్ గౌరవ అధ్యక్షుడు జి.శామ్యూల్, కె.పౌల్, బి.నాగరాజు, కె.లూకా, లక్ష్మణ్, చంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట నూకాలతల్లి జాతర ప్రారంభం



నూకాలమ్మతల్లికి పూజలు చేస్తున్న కమిటీ సభ్యులు, భక్తులు

గొలుగొండ : లింగంపేట నూకాలతల్లి జాతర ప్రారంభం అయింది. శనివారం రాత్రి అమ్మవారి పూజలు చేసి తల్లి ఆలయం తలుపులు మూసివేసిన అనంతరం సోమవారం 11 గంటలకు కమిటీ, వేదపండితుల ఆధ్వర్యంలో తిరిగి ఆలయ తలుపులు తీయడం జరిగింది. ఈ రోజు నుంచి వారం రోజుల పాటు అమ్మవారి ఉత్సవాలు ప్రతి రోజు ఘనంగా నిర్వహించడం జరుగుతుంది. కమిటీ చైర్మన్ కొడమంచిలి వరలక్ష్మి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మంగళవారం జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పోటీలు నిర్వహిస్తామన్నారు. జనసేన నాయకుల ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. రాష్ట్ర బీసీ డైరెక్టర్ రాజాన సూర్య చంద్రతో పాటు సలాదుల ప్రసాద్, గండెం దొరబాబు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్



జోలాపుట్టులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



అడ్డతీగలలో ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న ఏపీసీసీ కార్యదర్శి దంగేటి సత్తిబాబు



రాజవొమ్మంగి మసీదులో నమాజ్ చేస్తున్న ముస్లింలు



జి.మాడుగుల మసీదులో నమాజ్ చేస్తున్న ముస్లిం సోదరులు



కూనవరంలో రంజాన్ వేడుకల్లో పాల్గొన్న ఎస్ఐలు లతశ్రీ, సంతోష్‌కుమార్, ముస్లిం పెద్దలు

చింతపల్లి: రంజాన్ ఉపవాసాలు ఆధ్యాత్మిక ప్రశాంతత, క్రమశిక్షణకు ప్రతీక అని ముస్లిం వక్తలు ప్రబోధించారు. సోమవారం మండల కేంద్రం చింతపల్లిలోని మసీదులో రంజాన్ సందర్భంగా ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మత గురువు మహ్మద్ సాహీద్ మాట్లాడుతూ క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే ఈ రంజాన్ మాసపు సారాంశమని వివరించారు. చింతపల్లి, జీకే వీధి మండలాల నుంచి తరలివచ్చిన అధిక సంఖ్యలో ముస్లింలకు హిందువులు పాల్గొని రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మసీద్ కమిటీ అధ్యక్షుడు షేక్ మీరాసాహెబ్, మండల కో ఆప్షన్ సభ్యుడు షేక్ నాజర్‌వల్లి, సభ్యులు ఖాసీంవల్లి, నూర్‌సాహెబ్, షేక్ సత్తార్‌వల్లి, తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: రంజాన్ వేడుకలను ముస్లింలు సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మండలంలోని జోలాపుట్టు పంచాయతీ కేంద్రంలోని మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లింలకు హిందువులు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ప్రత్యేక విందు ఏర్పాటు చేసి హిందువులను ఆహ్వానించి, సహపంక్తి భోజనాలు చేశారు.

రాజవొమ్మంగి: మండల కేంద్రం రాజవొమ్మంగి రెహమానియా మసీదులో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చుట్టు పక్కల గ్రామాల్లోని ముస్లింలు తరలివచ్చి మసీదులో నమాజ్ జరిపారు. మత పెద్దలు రంజాన్ విశిష్టతను వివరించారు. ప్రతి ఒక్కరూ దాన గుణం కలిగి ఉండాలని సూచించారు. మహమ్మద్ ప్రవక్త చూపిన మార్గాన్ని ఎంచుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనంతరం కుటుంబ పెద్దలను స్మరించుకొంటూ ప్రార్థనల్లో పాల్గొన్నారు.

అడ్డతీగల: స్థానిక జామియా మసీదులో నూతన వస్త్రాలు ధరించి వచ్చిన ముస్లింలు భక్తిశ్రద్ధలతో నమాజ్ చేశారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఏపీసీసీ కార్యదర్శి దంగేటి సత్తిబాబు మసీదులోని ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

కూనవరం: మండల కేంద్రం కూనవరం బస్టాండ్ సెంటర్‌లోని కొత్త మసీదు, పాత మసీదులో ముస్లింలు రంజాన్ ప్రార్థనలు చేశారు. భిన్నత్వంలో ఏకత్వంలా హిందూ, క్రైస్తవ, ముస్లిం అందరూ సమానమే అన్న భావనతో ఒకరిని ఒకరు ఆలింగనం చేసుకుని స్నేహ పూర్వక అభిమానాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ లతశ్రీ, వీఆర్‌పురం ఎస్ఐ సంతోష్‌కుమార్, ఏఎస్ఐ సత్యనారాయణ, ముస్లిం మత పెద్దలు, వివిధ పార్టీల నాయకులు, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

బిలాల్ మసీదులో..

కొయ్యూరు: రాజేంద్రపాలెం బిలాల్ మసీదులో ఉదయం నుంచి ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం నమాజ్ చేశారు. ముస్లిం పెద్దలు పాద్‌షా, నాగూరు, ఇమామ్, బషీర్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

జి.మాడుగుల: స్థానిక మసీదులో ముస్లింలు కొత్త దుస్తులు ధరించి భక్తిశ్రద్ధలతో నమాజ్ చేశారు. ఒకరికొకరు రంజాన్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. రంజాన్ సందర్భంగా ఇఫ్తార్ విందు చేసుకున్నారు.

చింతూరు: స్థానిక మస్జిదే యాసీన్‌లో రంజాన్ పర్వదినాన్ని ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహించారు. మసీదులో ఇమాం ఎజాజ్ అహ్మద్ రెండు రకాతుల ఈదుల్‌ఫితర్ నమాజును పఠించారు. అనంతరం ఖురాన్ బోధనలు చేస్తూ ప్రతిఒక్కరూ అల్లాహ్ చూపిన మార్గాన్ని అనుసరిస్తూ నమాజ్ ఆచరించాలని సూచించారు.

సంగమేశ్వరస్వామికి భక్తుల నీరాజనం



సంగమేశ్వర స్వామి స్పటిక లింగానికి పూజలు చేస్తున్న అర్చకుడు శర్మ



సంగమేశ్వరస్వామి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

సాక్షి,పాడేరు: మినుములూరు పంచాయతీ మారుమూల సంగోడి గ్రామంలోని పార్వతీదేవి సమేత సిద్ధి సంగమేశ్వర ఆలయానికి భక్తుల నీరాజనం పలుకుతున్నారు. గత ఏడాది ప్రారంభమైన ఈ శివాలయంలో రాజస్తాన్ నుంచి తీసుకువచ్చిన స్పటిక లింగాన్ని బ్రహ్మకుమారీలు ప్రతిష్ఠించి ఆలయాన్ని నిర్మించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మోదాపల్లి పంచాయతీ గుర్రగరువు నుంచి సంగోడికి పక్కా తారురోడ్డును నిర్మించడంతో భక్తుల రాకపోకలకు అనువైంది. స్పటిక శివలింగంను దర్శించుకుని పూజలు చేసుకునేందుకు ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి భక్తులు నిత్యం భారీగా తరలివస్తున్నారు. సోమవారం కూడా వేకువజాము నుంచే సిద్ధి సంగమేశ్వరస్వామి దర్శనానికి పాడేరుతో పాటు అనేక ప్రాంతాలకు చెందిన భక్తులు బారులు తీరారు. ఆలయ అర్చకుడు శర్మ లోక కల్యాణార్థం స్పటిక లింగంకు ప్రత్యేక అభిషేకాలు చేశారు. పార్వతిదేవికి పూజలు చేశారు. భక్తులు తరలివస్తుండడంతో మారుమూల సంగోడి గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు



సంతబయలు మలుపు వద్ద ప్రమాద దృశ్యం

జి.మాడుగుల: పాడేరు హైవేలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జి.మాడుగుల మండలం కె.కోడాపల్లి పంచాయతీ గద్దరాయి గ్రామానికి చెందిన జె.గోపాలస్వామి అనే యువకుడు బైక్‌పై పాడేరు వైపు బయలుదేరాడు. సంతబయలు వద్ద బైక్, ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న గోపాల్ గాయపడడంతో స్థానికులు 108లో స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్య కోసం పాడేరు జిల్లా అస్పత్రికి పంపారు. ఈ ప్రమాదంపై పోలీసులకు ఫిర్యాదు అందాల్సి ఉంది.

